క్లుప్తంగా

ఏఐ ఆధారిత విద్యతోనే భవిష్యత్తు



ఎంపీ శ్రీభరత్‌ను సత్కరిస్తున్న విశాఖ అగ్రపీఠాధిపతి ఉడుముల బాల

సీతంపేట: కృత్రిమ మేధస్సు(ఏఐ) ప్రభావంతో మానవతను నిలబెట్టే విద్యా విలువలను ప్రోత్సహించేందుకు క్యాథలిక్ ఎడ్యుకేషన్ సమ్మిట్–2025ను విశాఖ ఆర్చ్‌డయాసిస్ ఘనంగా నిర్వహించింది. డైమండ్ పార్కు సమీపంలోని ఒక హోటల్‌లో శుక్రవారం 'గ్లోబల్ ఎడ్యుకేషన్ ట్రెండ్స్, భవిష్యత్ విద్యా విధానాలు, ఏఐ సవాళ్లపై' జరిగిన సదస్సును విశాఖ అగ్రపీఠాధిపతి డాక్టర్ ఉడుముల బాల జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ నేటి విద్యార్థులు ప్రపంచ పోటీలో ముందంజలో నిలవాలంటే ఏఐ ఆధారిత ఆధునిక విద్య తప్పనిసరన్నారు. ఉడుముల బాల మాట్లాడుతూ ప్రపంచం వేగంగా మారుతున్న ఈ యుగంలో ఆలోచించు, స్థానికతను ప్రోత్సహించు అనే సిద్ధాంతం అత్యంత ప్రాధాన్యమైనదని పేర్కొన్నారు. విద్యా రంగ నిపుణుడు కె.వి.ప్రవీణ్‌రాజ్, నిశాంత్‌రెడ్డి, ఫాదర్ భారత్, ఫాదర్ జొన్నాడ జాన్‌ప్రకాష్, ఫాదర్ దుగ్గంపూడి బాలశౌరి ప్రసంగించారు. సదస్సులో విశాఖ, అనకాపల్లి, విజయనగరం, తూర్పు గోదావరి జిల్లాలకు చెందిన పలు విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు వైభవుడికి సుప్రభాత సేవ



వైభవ వేంకటేశ్వరుడు

మురళీనగర్: కప్పరాడ ఎన్జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామికి శనివారం సుప్రభాత సేవ నిర్వహిస్తారు. తెల్లవారుజామున సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపిస్తారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేస్తారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరుగుతాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు. సాయంత్రం 6.30 గంటలకు వైభవుడికి విశేష హారతులు సమర్పిస్తారు.

2 వరకు వైద్య శిబిరాలు కొనసాగించాలి



బాపూజీనగర్ ఆరోగ్య కేంద్రంలో వైద్య సేవలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి(డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు శుక్రవారం పలు పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాపూజీనగర్ ఆరోగ్య కేంద్రం, స్వర్ణభారతి స్టేడియం సమీపంలోని ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులు, సిబ్బందికి పలు సూచనలిచ్చారు. అభ ఐడీ రిజిస్ట్రేషన్‌ను పరిశీలించి, స్పెషలిస్ట్ డాక్టర్ సేవలు, గర్భిణులకు అందిస్తున్న వైద్యం, క్యాన్సర్ పరీక్షలు, తదితర విషయాలపై అవగాహన కల్పించారు. ఈ వైద్య శిబిరాలు అక్టోబర్ 2 వరకు కొనసాగించాలని, మాతా శిశు సేవలు, గర్భిణులకు వైద్య సేవలు సాధ్యమైనంత వరకు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు మధ్యలో మట్టి కుప్ప



మురళీనగర్ వాకర్స్ క్లబ్ వద్ద రోడ్డు మధ్యలో వేసిన మట్టి

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ వద్ద రహదారికి మధ్యలో భారీ మొత్తంలో మట్టిని వేయడంతో అటుగా రాకపోకలు సాగించే వాహన చోదకులు, పాదచారులు ఇబ్బంది పడుతున్నారు. ఈ మట్టిని రహదారి అంచుల వద్ద కాకుండా మధ్యలో వేసి వదిలేయడంతో ఈ సమస్య ఏర్పడింది. ఈ మట్టి కుప్పను తక్షణం తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.


కళా నైపుణ్యం.. అపురూపం



దుర్గమ్మ విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు



శంకరమఠం వద్ద సిద్ధం చేస్తున్న దుర్గాదేవి విగ్రహాలు



దసరా ఉత్సవాలకు సిద్ధమవుతున్న 14 అడుగుల కనకదుర్గమ్మ మట్టి విగ్రహం

- దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలకు సిద్ధమవుతున్న విగ్రహాలు
- పర్యావరణ హితంగా విగ్రహాలు తీర్చిదిద్దుతున్న కోల్‌కతా కళాకారులు
- గంగానది మట్టి, ఆర్గానిక్ కలర్స్‌తో రూపకల్పన
- 25 ఏళ్లుగా అక్కయ్యపాలెంలో తయారీ



దుర్గామాత విగ్రహం తయారు చేస్తున్న కోల్‌కతా కళాకారులు


సీతంపేట: నగరంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందడి మొదలైంది. దసరా సంబరాల కోసం కోల్‌కతా కళాకారులు గంగానది మట్టితో దుర్గామాత విగ్రహాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నారు. ఈ నెల 22 నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండటంతో అపురూపమైన అమ్మవారి విగ్రహాలను సిద్ధం చేస్తున్నారు. శంకరమఠం పక్కన గల ఖాళీ స్థలంలో టెంట్లు వేసి కొకోన్ బృందం విగ్రహాల తయారీలో నిమగ్నమైంది. కోల్‌కతా నుంచి వచ్చిన కళాకారులు వినాయక చవితి తర్వాత దసరా ఉత్సవాలకు దుర్గాదేవి విగ్రహాలను తయారు చేస్తుంటారు. శరన్నవరాత్రి ఉత్సవ నిర్వాహకుల కోరిక మేరకు, వారు ఇచ్చిన ఫొటోలో ఉన్నట్టుగా విగ్రహాలు తయారు చేసి ఇవ్వడం కొకోన్ బృందం ప్రత్యేకత.

మట్టి విగ్రహాలకు డిమాండ్

పర్యావరణానికి హాని కలగని రీతిలో వీధుల్లో మండపాలు ఏర్పాటు చేసి దుర్గాదేవి మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించడానికి యువత సన్నద్ధమవుతున్నారు. ఆస్‌బెస్టాస్‌తో తయారు చేసిన బొమ్మల కంటే ధర కాస్త ఎక్కువైనా మట్టి విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు ఉత్సవ నిర్వాహకులు మొగ్గు చూపుతున్నారు. దీంతో కోల్‌కతా కళాకారులు తయారు చేస్తున్న మట్టి విగ్రహాలకు డిమాండ్ పెరిగింది. మూడు నెలల ముందుగా కోల్‌కతా నుంచి కళాకారులు కొకోన్, నోవాపాల్ బృందం విశాఖ వస్తుంది. అక్కయ్యపాలెం జగన్నాథపురం రోడ్డు, రామచంద్రానగర్, శంకరమఠం పక్కన తాత్కాలిక షెడ్‌లు ఏర్పాటు చేసి విభిన్న రూపాలు, సైజుల్లో మట్టి విగ్రహాలు తయారు చేస్తుంటారు. 25 ఏళ్లుగా నగరంలో వీరు విగ్రహాలు తయారు చేసి అందిస్తుండటం విశేషం.

పర్యావరణ హితం..

కొకోన్, నోవాపాల్ బృందం 25 ఏళ్ల కిందట నుంచే పర్యావరణ హితమైన విగ్రహాలను రూపొందిస్తున్నారు. ప్రతి ఏటా దసరాకు మూడు నెలల ముందుగా మట్టి విగ్రహాల తయారీని ప్రారంభిస్తారు. మట్టి, నరుగుడు కర్ర, గడ్డి, వాటర్ కలర్స్ వినియోగించి హానికరం కాని విగ్రహాలను రూపొందిస్తూ పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్నారు. మట్టిలో సులువుగా కలిసిపోయే సామగ్రితోనే కోల్‌కతాలో విగ్రహాలు తయారీ చేస్తారని, ఆ పద్ధతినే విశాఖలో ప్రవేశపెట్టామని కళాకారుడు కొకోన్ తెలియజేశాడు. 25 ఏళ్లుగా విశాఖ ప్రజలు తమను ఎంతగానో ఆదరిస్తున్నారన్నారు.



ఆకట్టుకుంటున్న దుర్గాదేవి విగ్రహం

ఉత్సవ నిర్వాహకులు మెచ్చేలా విగ్రహాల తయారీ



ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో కంటే మట్టితో విగ్రహాలు రూపొందించడం చాలా కష్టమైన పని. 12 మంది కళాకారులతో 3 అడుగుల నుంచి 14 అడుగుల భారీ విగ్రహాలను రూపొందించాం. తొమ్మిది రోజుల పాటు వివిధ రూపాల్లో దర్శనమిచ్చే దుర్గామాతను ప్రతిష్ఠించడానికి నగరంలోని ఉత్సవ కమిటీలు, యువత ఇచ్చిన ఆర్డర్లు మేరకు చేస్తున్నాం. రకరకాల కాన్సెప్ట్‌లు, నిర్వాహకులకు కావాల్సిన విధంగా విగ్రహాలు తయారు చేసి ఇస్తున్నాం.

– కొకోన్, విగ్రహ తయారీదారుడు, కోల్‌కతా

మూడు నెలల కృషి



ఏటా మూడు నెలల పాటు కోల్‌కతా నుంచి విశాఖ వచ్చి వినాయకుడు, దుర్గాదేవి విగ్రహాలు తయారు చేస్తాం. గంగానది మట్టి, ఆర్గానిక్ కలర్స్‌తో విగ్రహాలు రూపొందిస్తాం. తయారు చేసిన చోటే వండుకుని తినేసి పడుకుంటాం. 15 ఏళ్లుగా విశాఖ వస్తున్నాను. ఇక్కడ మట్టి విగ్రహాలను మంచి డిమాండ్ ఉంది.

– సమీర్‌దాస్, కళాకారుడు, కోల్‌కతా

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

విశాఖ సిటీ: ఏపీఈపీడీసీఎల్ జోన్–1 పరిధిలోని 33/11 కేవీ టీఎస్‌ఆర్ సబ్‌స్టేషన్‌లో 8 ఫీడర్ల నిర్వహణ కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 6.30 నుంచి 10.30 గంటల వరకు ద్వారకానగర్, సంగం శరత్ థియేటర్ వెనుక, డైమండ్ పార్క్, ఆర్టీసీ కాంప్లెక్స్, మధురానగర్, లలితానగర్, రామకృష్ణానగర్, మండవారిపేట, నెహ్రూ బజార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని పేర్కొన్నారు.

తాటిచెట్లపాలెం: గ్రీన్ పార్క్ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జోన్–1 ఈఈ(ఆపరేషన్స్) పోలాకి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ నగర్, ఎన్జీజీవోస్ కాలనీ, శాంతిపురం, బాలయ్యశాస్త్రి లేఅవుట్, నరసింహనగర్, నరసింహనగర్ రైతుబజార్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

సీతంపేట: చెట్ల కొమ్మల తొలగింపు, హెచ్‌టీ లైన్స్ మెయింటెనన్స్ పనుల నిమిత్తం శనివారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ మేరకు శాంతిపురం, కైట్స్ జూనియర్ కళాశాల, సీతంపేట, గణేష్‌బాబు ఆస్పత్రి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

మద్రిపాలెం: జోన్–2 ఎయిర్‌పోర్ట్, శాంతినగర్ 11 కేవీ ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ బీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు మాధవధార, సాయినగర్, పార్వతీనగర్, టాటా మోటర్స్ ఏరియా, జాకీర్ హుస్సేన్ నగర్, ఎస్ఏడీ, గణేష్‌నగర్, కరాస, గౌరీనగర్, శాంతినగర్, అంబేద్కర్ కాలనీ, నేతాజీనగర్, సంజీవయ్య కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించాలని కోరారు.

సేవా కార్యక్రమాలపై చర్చ

మురళీనగర్: మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ కార్యవర్గ సమావేశం శుక్రవారం వైశాఖి స్పోర్ట్స్ పార్కు వనితా భవన్‌లో నిర్వహించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ముందుగా ఇటీవల మృతి చెందిన వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వ అధ్యక్షుడు కృష్ణారావు ఆత్మకు శాంతి కలగాలని సంతాపం ప్రకటించారు. అనంతరం అక్టోబర్‌లో నిర్వహించాల్సిన సేవా కార్యక్రమాలపై చర్చించారు. అక్టోబర్ 1న ప్రపంచ సీనియర్ సిటిజన్స్ దినోత్సవం, 2న గాంధీ జయంతి, 6న క్లబ్ సర్వసభ్య సమావేశం, 29న సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. వాకర్స్ ఇంటర్నేషనల్ ఆర్‌సీ–5 యు.శుభ, పూర్వ అధ్యక్షురాలు జె.ఉమాదేవి, కార్యదర్శి ఎం.జయ, కోశాధికారి కె.భానుమతి, సంయుక్త కార్యదర్శి జి.శిరీషలత పాల్గొన్నారు.

చిరు వ్యాపారులపై జులుం

- కొనసాగిన ఆక్రమణల తొలగింపు
- ఉన్నపళంగా బడ్డీలు తొలగించడంపై చిరు వ్యాపారుల ఆగ్రహం
- కడుపులు కొట్టి రోడ్డున పడేశారని ఆవేదన



సంఘం ఆఫీస్ కూడలిలో దుకాణాల కౌంటర్లు తొలగిస్తున్న జీవీఎంసీ సిబ్బంది



ఫుట్‌పాత్‌పై నిర్మించిన మెట్లు తొలగిస్తున్న సిబ్బంది

సీతంపేట: జీవీఎంసీ జోన్–3 పరిధిలోని రహదారులు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల తొలగింపు రెండో రోజు కొనసాగింది. టౌన్ ప్లానింగ్ ఏసీపీ మధుసూదన్ పర్యవేక్షణలో సిబ్బంది శుక్రవారం ఉదయం 7 గంటల నుంచి అక్కయ్యపాలెం మెయిన్ రోడ్డులోని ఆక్రమణలు తొలగించారు. అక్కయ్యపాలెం హైవే నుంచి దొండపర్తి కూడలి వరకు, అనంతరం అక్కడి నుంచి డైమండ్ పార్క్ వరకు డ్రైవ్ నిర్వహించారు. ఈ మార్గంలో ఫుట్‌పాత్, రోడ్డును ఆక్రమించి ఏర్పాటు చేసిన బడ్డీలు, టీ, టిఫిన్ షాప్ కౌంటర్లు, డిస్‌ప్లే బోర్డులు, మెట్లు, షాపుల ముందు ఐరన్ షెడ్లను తొలగించారు. ఈ డ్రైవ్‌లో జోన్–3 టౌన్ ప్లానింగ్ టీపీవో ప్రమీల, ట్రాఫిక్ ఎస్‌ఐ ఉమామహేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు, చైన్‌మెన్లు, బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్లు, మహిళా పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

అక్కయ్యపాలెం టు డైమండ్ పార్క్.. వయా దొండపర్తి

అక్కయ్యపాలెం జగ్గారావు బ్రిడ్జి వద్ద ఆక్రమణ తొలగింపు సమయంలో స్థానిక చికెన్ షాప్ నిర్వాహకుడు విడిచిపెట్టమని వాదులాడినా తొలగించేశారు. సంఘం ఆఫీస్ కూడలిలో పెట్రోల్ బంక్ వద్ద తొలగింపులు చేపట్టారు. దాలిరాజు సూపర్ మార్కెట్ ముందున్న పాప్‌కార్న్ మిషన్, చాట్ బండిని తొలగించారు. ఫుట్‌పాత్‌పై నిర్మించిన జనరేటర్ రూమ్ గోడను కూల్చివేశారు. ఫుట్‌పాత్ పైకి వచ్చిన దుకాణాల రేకుల షెడ్లు, పూల దుకాణాలను నిర్దాక్షిణ్యంగా తొలగించారు. పాదచారులకు అడ్డు లేకున్నా ఎందుకు తొలగిస్తున్నారంటూ షాపు యజమానులు ప్రశ్నించినా.. సిబ్బంది కనికరం చూపలేదు. కొంత మంది వ్యాపారులు ముందు జాగ్రత్తగా వారి షాపు ముందు ఆక్రమణలను వారే తొలగించుకున్నారు. ఎరుకుమాంబ గుడి, దొండపర్తి కూడలి, డైమండ్ పార్కు రోడ్డులో కూడా ఇదే తరహాలో ఆక్రమణలు తొలగించారు. ముందస్తు నోటీసులు, సమాచారం ఇవ్వకుండా ఉన్నపళంగా బడ్డీలు ధ్వంసం చేయడం, ఆక్రమణలు తొలగించడం సరికాదని వ్యాపారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ముందుగా చెబితే తామే స్వచ్ఛందంగా తొలగించే వారిమని, ఇప్పుడు రోడ్డున పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు.



దాలిరాజు సూపర్ మార్కెట్ ముందున్న ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

రూ.1.50 లక్షల నష్టం

శంకరమఠం రోడ్డులో 32 ఏళ్లుగా బడ్డీ నిర్వహిస్తున్నాను. ట్యాక్స్ కడుతున్నాను. ఉదయం 11 గంటలకు చెప్పి.. సాయంత్రం 4 గంటలకు వచ్చి నా బడ్డీని జేసీబీతో ధ్వంసం చేశారు. బడ్డీ తరలించే సమయం కూడా ఇవ్వలేదు. రూ.లక్షన్నర నష్టం వచ్చింది. దీనిని ఎవరు ఇస్తారు. మా లాంటి చిరు వ్యాపారుల కడుపులు కొట్టారు.

– కె.గౌరీశంకర్, అక్కయ్యపాలెం

ఇంత నష్టం ఎలా భరించేది..

23 ఏళ్లుగా శంకరమఠం సమీపంలోని ఫుట్‌పాత్‌పై పాన్‌షాప్ నిర్వహిస్తున్నాను. ముందస్తు సమాచారం ఇవ్వకుండా హఠాత్తుగా సిబ్బంది వచ్చి బడ్డీని ధ్వంసం చేశారు. దానిలో సరకు కూడా తీసుకునే సమయం ఇవ్వలేదు. ముందుగా చెబితే బడ్డీని వేరే చోటుకు తరలించేవాడిని. ఇపుడు నాకు రూ.3 లక్షల నష్టం వచ్చింది. ఇంత నష్టం ఎలా భరించాలి.

– పి.కమలరాజు, పాన్‌షాప్ నిర్వాహకుడు

డిమాండ్ల సాధనకు రైల్వే కార్మికుల ధర్నా



డీఆర్‌ఎం కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఈస్ట్‌కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్ నాయకులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా రైల్వేమెన్స్ ఫెడరేషన్ (ఏఐఆర్‌ఎఫ్) జాతీయ స్థాయిలో ఇచ్చిన పిలుపు మేరకు ఈస్ట్ కోస్ట్ రైల్వే శ్రామిక్ యూనియన్, వాల్తేర్ డివిజన్ కో ఆర్డినేటర్ పి.రామమోహనరావు ఆధ్వర్యంలో శుక్రవారం దొండపర్తి డీఆర్‌ఎం కార్యాలయం వద్ద భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రామమోహనరావు మాట్లాడుతూ 8వ వేతన సంఘం ఏర్పాటు చేయాలని, రైల్వే కార్మికులపై పని ఒత్తిడి తగ్గించాలని, ప్రైవేటైజేషన్, ఔట్‌సోర్సింగ్ విధానాలకు వ్యతిరేకంగాను, అన్ని విభాగాల్లోని ఖాళీలను తక్షణం భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. రైల్వే భద్రతకు కీలకంగా నిలిచిన ఇంజినీరింగ్ ట్రాక్‌మెన్‌ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, రన్నింగ్ స్టాఫ్‌కు మినిమం గ్యారంటీడ్ కిలోమీటర్ అమలు చేయాలని కోరారు. ఎల్‌డీసీ, జీడీసీ ద్వారా సకాలంలో పోస్టులు భర్తీ చేయాలని, వాటిలో ఇంజినీరింగ్ కార్మికులకు అవకాశం కల్పించాలన్నారు. తమ డిమాండ్ల సాధన కోసం డివిజనల్ రైల్వే మేనేజర్ ద్వారా రైల్వే బోర్డు చైర్మన్‌కు మెమోరాండం సమర్పిస్తున్నట్లు రామమోహనరావు తెలిపారు. ధర్నా అనంతరం యూనియన్ నాయకులు డీఆర్‌ఎం లలిత్ బోహ్రాకు మెమోరాండం సమర్పించారు. ధర్నాలో జోనల్ అధ్యక్షుడు ఆర్.వి.ఎస్.ఎస్.రావు, కేంద్ర నాయకులు, బ్రాంచ్ కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు, రైల్వే కార్మికులు పాల్గొన్నారు.

తప్పనిసరి ఓటీపీలతో కక్షిదారులకు ఇబ్బందులు



సబ్ రిజిస్ట్రార్ నారాయణకు వినతిపత్రం అందజేస్తున్న దస్తావేజు లేఖరులు

సీతంపేట: డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్ సమయంలో అందరు పార్టీలకు ఓటీపీ తప్పనిసరి చేయడంతో చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని ద్వారకానగర్ దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం ప్రతినిధులు ఎస్.హెచ్.వి.రామకృష్ణారావు, వెంకటరమణ, కామేశ్వరరావు, రంగారావు, ఎంఎస్.రావు, కాయల శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఇటీవల రిజిస్ట్రేషన్ శాఖలో వచ్చిన కొత్త విధానాలను నిరసిస్తూ శుక్రవారం అక్కయ్యపాలెం మెయిన్ రోడ్‌లోని ద్వారకానగర్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద పెన్‌డౌన్ చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పార్టీలకు ఓటీపీ తప్పనిసరి చేయడం వల్ల ఆధార్ సర్వర్ డౌన్ అయినప్పుడు జరుగుతున్న జాప్యం వల్ల కక్షిదారులకు ఇబ్బంది కలుగుతోందన్నారు. ఎనీవేర్ రిజిస్ట్రేషన్ చేయడంలో ఉన్న అప్రూవల్ విధానాన్ని తొలగించాలని, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పత్రాలు, విక్రయ అగ్రిమెంట్‌తోకూడిన జీపీఏ పత్రాల ద్వారా రెగ్యులర్ డీడ్స్ చేసే సమయంలో ఓటీపీ ఆప్షనల్‌గా ఉండాలి గాని, తప్పనిసరి చేయకూడదని, సెల్ఫ్ సవరణలో కూడా ఓటీపీ ఆప్షనల్‌గా ఉండాలని డిమాండ్ చేశారు. చెక్ స్లిప్/పబ్లిక్ డాటా ఎంట్రీ సమయంలో పాన్‌కార్డు నమోదు ఆప్షన్ సరిగా పనిచేయక జాప్యం జరుగుతోందన్నారు. నాన్ జ్యుడీషియల్ స్టాంప్ కొనుగోలుకు ఓటీపీలు రాక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. స్లాట్ బుక్ చేసిన తర్వాత రిజిస్ట్రార్ ఆఫీస్‌లో డాక్యుమెంట్ డేటా ఎంట్రీ సవరణ చేసుకునే అవకాశం, చలానా ఎంట్రీ అవకాశం కల్పించాలన్నారు. కొత్త విధానాలను నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా శుక్ర, శనివారాల్లో రెండు రోజులపాటు అన్ని రిజిస్ట్రార్ కార్యాలయాల ఎదుట దస్తావేజు లేఖరులు పెన్‌డౌన్ చేపట్టి నిరసన చేపడుతున్నట్టు చెప్పారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సబ్ రిజిస్ట్రార్ డి.వి.నారాయణకు అందజేశారు. దస్తావేజు లేఖరులు సోమేశ్వరరావు, ఎస్.రాజ్‌కుమార్, వి.మహేష్, కె.వెంకటేష్, గణేష్, సతీష్, చంద్రశేఖర్, లక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

బడ్డీల తొలగింపు.. పేదల గగ్గోలు

మురళీనగర్: మురళీనగర్ పరిసరాల్లోని రహదారి ఆక్రమణలను తొలగించేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు తీసుకున్నారు. మాధవధార–మురళీనగర్ 48 బస్ రూట్‌లోని ఆక్రమణలను శుక్రవారం తొలగించారు. మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు జీవీఎంసీ అధికారులు పోలీసుల భద్రత మధ్య రహదారిని ఆనుకుని ఉన్న షాపులు, బడ్డీలు, చిన్నపాటి దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, మాంసం కొట్లు, పండ్లు, కొబ్బరికాయలు, కూరగాయల షాపులతోపాటు రహదారిపై అక్రమ నిర్మాణాలను పొక్లెయిన్‌లతో తొలగించారు. భారీ ఎత్తున జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు. మురళీనగర్‌లోని ఇతర రహదారుల్లో కూడా ఆక్రమణలను తొలగిస్తామని అధికారులు తెలిపారు.

ఆర్థికంగా నష్టపోయిన చిరు వ్యాపారులు

స్థానిక రహదారులను ఆనుకుని ఉన్న షాపు యజమానులు వారి ఎదురుగా రోడ్డుపై బడ్డీలు, బజ్జీల షాపులు పెట్టుకోడానికి చిరు వ్యాపారుల నుంచి అడ్వాన్స్‌లు, నెలవారీ అద్దెలు వసూలు చేస్తున్నారు. ఈ బడ్డీలను తొలగించడంతో యజమానుల అడ్వాన్స్‌లు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తున్న నేపథ్యంలో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీని వల్ల చిన్న బడ్డీలు, పకోడీ బళ్లు నిర్వహిస్తున్న పేదలు లక్షలాది రూపాయల సొమ్ము నష్టపోవడమే కాకుండా జీవనోపాధిని కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని వాపోయారు. ఇంతవరకు నెలవారీ వసూళ్లతో ఎంజాయ్ చేసిన జీవీఎంసీ సిబ్బందిలో గుబులు నెలకొంది.



సెక్టార్–6 సమీపంలో రోడ్డు ఆక్రమణను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న సిబ్బంది



మురళీనగర్–మాధవధార రోడ్డు పక్కన బడ్డీని తొలగిస్తున్న సిబ్బంది



మసీదు కూడలి వద్ద తొలగించిన బడ్డీలు

ఇష్టానుసారంగా చెట్ల నరికివేత



జగన్నాథపురంలో నరికివేసిన భారీ చెట్లు

సీతంపేట: పర్యావరణ పరిరక్షణకు మొక్కలు విరివిగా నాటాలని ప్రభుత్వాలు, పర్యావరణ వేత్తలు ప్రచారం చేస్తుంటే.. కొంతమంది మాత్రం తమ సొంత అవసరాలకు చెట్లను ఇష్టానుసారంగా నరికేస్తున్నారు. అక్కయ్యపాలెం జగన్నాథపురంలోని జీవీఎంసీ ఎలిమెంటరీ స్కూల్ రోడ్‌లో ఉన్న భారీ కదంబం చెట్లను శుక్రవారం ఉన్నపళంగా నరికేశారు. ఈ మార్గంలో ఎంతో నీడను, మంచి గాలిని ఇచ్చే చెట్లను ఎందుకు నరికేశారో తెలియడం లేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పచ్చని చెట్లను నరకడానికి అనుమతి లేనప్పటికీ.. దానికి విరుద్ధంగా చెట్లు నరికివేయడంపై పర్యావరణ ప్రేమికులు మండిపడుతున్నారు. హార్టికల్చర్ విభాగం, పర్యావరణ విభాగం అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా చెట్లు నరికివేస్తున్నా.. అధికార యంత్రాంగం చోద్యం చూస్తోందని విమర్శిస్తున్నారు. ఇటీవల లలితానగర్‌లోని శ్యామలాంబ గుడి సమీపంలో రోడ్డు పక్కన చెదలుపట్టి కూలిపోవడానికి సిద్ధంగా ఉన్న చెట్టును తొలగించాలని కోరితే వీలుపడదని చెప్పిన హార్టికల్చర్ విభాగం.. జగన్నాథపురంలో ఎలా చెట్లు నరికేశారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.